
రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి

రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించండి

బాలానగర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి కాంట్రాక్టర్, అధికారులకు సూచించారు. గురువారం రాజీవ్‌గాంధీనగర్‌లో నిర్మిస్తున్న వీడీసీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంస్ వర్క్ ఇన్‌స్పెక్టర్ రాములు, రాజీవ్‌గాంధీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, ప్రధాన కార్యదర్శి నరేశ్, బీఆర్‌ఎస్ నాయకుడు ఖాజ, షేక్ అరబ్, నాగేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


శ్రీశ్రీనగర్‌లో పాదయాత్ర చేస్తున్న
బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వర్‌రావు, నాయకులు

శ్రీశ్రీనగర్‌లో బీజేపీ బస్తీబాట

బాలానగర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీ బస్తీబాటలో భాగంగా గురువారం బాలానగర్ డివిజన్ శ్రీశ్రీనగర్‌లో పార్టీ నాయకులతో కలిసి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వర్‌రావు పాదయాత్ర చేశారు. బస్తీలో రేషన్ దుకాణంలో ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేశారు. అనంతరం బస్తీలో పర్యటించి ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శంకర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు రమేష్, బాలానగర్ డివిజన్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, నాయకులు శ్రీశైలం, వాణినాయుడు, నాగరాజు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

గాయత్రినగర్‌లో సమస్యలు పరిష్కరించాలి


కార్పొరేటర్ సబీహా బేగంకు వినతిపత్రం అందజేస్తున్న గాయత్రినగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు

అల్లాపూర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గాయత్రినగర్‌లో సమస్యలు పరిష్కరించాలని సంక్షేమ సంఘం నాయకులు అల్లాపూర్ కార్పొరేటర్ సబీహా బేగంకు విన్నవించారు. గురువారం ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇండోర్ షటిల్ స్టేడియం పైకప్పు సరిగా లేదని, వర్షం వచ్చినప్పుడు నీరు స్టేడియంలో నిలుస్తోందని, కాలనీలో 60 ఫీట్ల రోడ్డు డివైడర్‌కు గ్రిల్ వేయాలని, సున్నం చెరువు వద్ద రాక్ గార్డెన్ పార్కులో నిలిచిపోయిన అభివృద్ధి పనులను ప్రారంభించాలని కోరారు. కార్పొరేటర్‌ను కలిసిన వారిలో గాయత్రినగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎం. కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి వెంకట రమణాచారి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఎన్. కృష్ణారెడ్డి ఉన్నారు.


రామారావు నగర్‌లో నాలాను పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంసీ అధికారులు

వర్షాకాలం లోపు నాలా అభివృద్ధి పనులు పూర్తి చేస్తాం

అల్లాపూర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రామారావు నగర్‌లో నాలా అభివృద్ధి పనులను జీహెచ్‌ఎంసీ అధికారులు గురువారం పరిశీలించారు. వర్షాకాలం లోపు పనులు పూర్తి చేస్తామని తెలిపారు. నాలాను పరిశీలించిన వారిలో డీఈలు రమేష్, శంకర్, క్వాలిటీ ఇంజనీర్ రాజు, కాలనీ సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు నాగుల సత్యం ఉన్నారు.

నేడు తులసినగర్‌లో చిన్నారులకు ఆధార్ నమోదు

అల్లాపూర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): తులసినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ఐదేళ్లలోపు చిన్నారులకు ఆధార్ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నారని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సామ కొండల్‌రెడ్డి తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందని, చిన్నారుల బర్త్ సర్టిఫికెట్, మొబైల్ లింక్ చేయబడిన తల్లిదండ్రుల ఆధార్ కార్డు, చిరునామా పత్రాలు తీసుకురావాలని సూచించారు.

తాగునీటి దందా

- యథేచ్ఛగా వాటర్ ప్లాంట్లు
- అనుమతి లేకుండా ఏర్పాటు
- నాణ్యతా ప్రమాణాలు గాలికి
- పట్టించుకోని అధికారులు

అల్లాపూర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మినరల్ వాటర్ పేరుతో తాగునీటి విక్రయాలు యథేచ్ఛగా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. అల్లాపూర్, మోతీనగర్, సఫ్దర్ నగర్ తదితర ప్రాంతాల్లో మినరల్ వాటర్ ప్లాంట్లు వెలిశాయి. కొన్నింటిని అనుమతి లేకుండా ఏర్పాటు చేసి నాణ్యతా ప్రమాణాలను పాటించకుండా నడిపిస్తున్నారు. దీనిపై జీహెచ్‌ఎంసీ ఏఎంఓహెచ్, మూసాపేట సర్కిల్ అధికారి డా. కార్తీక్‌ను వివరణ కోరగా.. వాటర్ ప్లాంట్ల తనిఖీ, నాణ్యతా ప్రమాణాల పరిశీలన తమ పరిధిలోకి రాదన్నారు.

అల్లాపూర్, బోరబండ, మాదాపూర్, మోతీనగర్‌లలో కొన్నేళ్లుగా నీటి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అల్లాపూర్ డివిజన్‌లో సున్నం చెరువు, కాముని చెరువు సమీపంలో నీటి కేంద్రాలు వెలిశాయి. ఇక్కడి నుంచి నీటిని ప్రజలతో పాటు హైటెక్ సిటీలోని కంపెనీలకు కూడా సరఫరా చేస్తున్నారు. 20 లీటర్ల క్యాన్లపై సంస్థ పేరు, ఐఎస్ఐ గుర్తింపు నంబర్ లేకుండానే ఒక క్యాన్ రూ. 20 నుంచి 25 రూపాయలకు విక్రయిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

అపరిశుభ్రంగా టిన్‌లు

నీటి సరఫరాకు వినియోగించే టిన్‌లను కడగడం లేదని, పాచిపట్టి అపరిశుభ్రంగా ఉంటున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు తనిఖీలు చేయకపోవడం వల్ల కొందరు వ్యాపారులు నీటి నాణ్యత, శుభ్రత పాటించడం లేదంటున్నారు.


ఆటో ట్రాలీలో తరలిస్తున్న మినరల్ వాటర్ బబుల్స్

జలమండలి సరఫరా చేసే నీరు తాగితే మేలు



జలమండలి సరఫరా చేసే నీరు శాస్త్రీయ పద్ధతుల్లో ట్రీట్‌మెంట్ ప్లాంట్లలో శుద్ధి చేయబడుతుంది. తగిన మోతాదులో క్లోరినేషన్ ప్రక్రియ జరుగుతుంది. టీడీఎస్ (టోటల్ సాల్యుబుల్ సాలిడ్స్) కూడా ఆరోగ్యకర మోతాదులో ఉంటుంది. బహిరంగ మార్కెట్‌లో లభించే మినరల్ వాటర్ కన్నా జలమండలి సరఫరా చేసే నీరు తాగితే మేలు.

- అన్విత్, సెక్షన్ మేనేజర్, హైదరాబాగ్ మెట్రో వాటర్‌వర్క్స్, గాయత్రి నగర్ సెక్షన్

అమ్మునగర్ తండా వాసులకు అండగా ఉంటా

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

బాలానగర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అమ్మునగర్ తండా వాసులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హామీ ఇచ్చారు. గురువారం ఉదయం కార్పొరేటర్ పి. సతీష్‌గౌడ్‌తో కలిసి తండాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో తండాలోని 127 మందికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరయ్యాయని, అందులో 69 మందికి లక్కీడిప్ ద్వారా ఇళ్లను అందజేయడం జరిగిందని తెలిపారు. మిగిలిన వారికి ఇళ్లు మంజూరయ్యేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు భిక్షపతి, సుదర్శన్‌రెడ్డి, వీరేశం, భాగయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


అమ్మునగర్ తండాలో పర్యటిస్తున్న
ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ సతీష్‌గౌడ్, నాయకులు

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

ఫతేనగర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కూకట్‌పల్లి డిపో పరిధిలో తిరిగే బస్సుల్లో ప్రయాణించే వారికి సమస్యలు ఉంటే నేరుగా డిపో డీఎంకు తెలియజేసేందుకు శుక్రవారం డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మేనేజర్ డి. హరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు అందుబాటులో ఉంటానని, ప్రయాణికులు 9959226151 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు తెలియజేయవచ్చన్నారు.

'పది'లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు
లక్షరూపాయల బహుమతి

కూకట్‌పల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆలివ్ మిఠాయి దొరరాజు లక్ష రూపాయలు నగదు బహుమతి అందజేయడం అభినందనీయమని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. గురువారం క్యాంపు కార్యాలయంలో 'బాగా చదవండి లక్షరూపాయలు పొందండి' అని రూపొందించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ప్రోత్సహించడానికి దొరబాబు చేస్తున్న కృషిని కొనియాడారు. దొరరాజు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతీరోజు సాయంత్రం 5గంటలకు కోర్సులకు సంబంధించిన వివరాలు నిపుణులచే అందిస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తూము శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా బోర్లు వేసిన వారిపై
చర్యలు తీసుకోవాలి


ఎమ్మార్వో కార్యాలయంలో అధికారికి ఫిర్యాదు చేస్తున్న అమ్రేశ్ రాజు

అల్లాపూర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్‌లో అక్రమంగా బోర్లు వేసి నీటి వ్యాపారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ అధికార ప్రతినిధి జె. అమ్రేశ్ రాజు ఎమ్మార్వో కార్యాలయంలో గురువారం ఫిర్యాదు చేశాడు. సఫ్దర్ నగర్, రాజీవ్‌గాంధీ నగర్, యూసుఫ్ నగర్‌లలో 400, 500 ఫీట్లకు మించి బోర్లు వేసి నీటి వ్యాపారం చేస్తుండడంతో ఇళ్లలోని బోర్లలో నీరు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు.


స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు

శాతవాహన కాలనీలో సమస్యలు పరిష్కరిస్తాం

హైదర్‌నగర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఎంటీ శాతవాహన కాలనీలో జరుగుతున్న డ్రైనేజీ పైపులైన్ పనులను ఇరిగేషన్ విభాగం అధికారులతో కలిసి కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో సమస్యలు పరిష్కరిస్తామన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని, ఆయిల్ సీడ్స్ బాల్స్‌ను చెరువుల్లో వేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ లక్ష్మీనారాయణ, కాలనీ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


వరదనీటి కాలువలో పూడికతీత పనులను పరిశీలిస్తున్న
కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

వర్షా కాలం లోపే
నాలాలో పూడికతీత పనులు పూర్తి చేయండి

హైదర్‌నగర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పరికి చెరువు నుంచి ఆల్విన్‌కాలనీ ఫేజ్-2 మీదుగా పైపులైన్ రోడ్డు వరకు విస్తరించి ఉన్న ఓపెన్ నాలా, వరదనీటి కాలువలో జరుగుతున్న పూడికతీత పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం లోపే ఓపెన్ నాలాలో పూడికతీత పనులను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, షౌకత్‌అలీ మున్నా, ఏఈ శ్రావణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి అధికారులపై చర్యలు తీసుకోండి : ఎమ్మెల్యే

కూకట్‌పల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు తీసుకుంటున్న నిర్ణయాలతో ప్రజలు, భవన నిర్మాణదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని అదనపు సిటీ ప్లానర్ గంగాధర్‌ను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. గురువారం జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూకట్‌పల్లిలో నిబంధనలకు విరుద్ధంగా భవనాల నిర్మాణానికి అనుమతులు ఇస్తున్నారని, శేరిలింగంపల్లి పరిధిలో అనుమతులు లేకుండా ఐదంతస్తులకు పైగా భవనాలను నిర్మిస్తున్నా టౌన్‌ప్లానింగ్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదన్నారు. అనుమతి లేని భవనాలపై చర్యలు తీసుకోవాలని అదనపు సీపీతోపాటు హైడ్రా కమిషనర్, కూకట్‌పల్లి జోన్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కో-ఆర్డినేటర్ సతీష్ అరోరా తదితరులు పాల్గొన్నారు.

'రాజీవ్ యువ వికాసం'లో క్షత్రియ కులాన్ని చేర్చాలి

కూకట్‌పల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకంలో కొన్ని కులాలకు చోటు కల్పించకపోవడం దురదృష్టకరమని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో క్షత్రియ మరియు ఆంధ్రప్రదేశ్‌లో అనేక కులాలకు చెందిన పేద, బడుగు, బలహీనవర్గాల వారు ఉన్నారని వారందరికీ పథకంలో అవకాశం కల్పించాలని కమిషనర్‌ను కోరారు.

సమతానగర్‌లో కమ్యూనిటీహాల్ భవనం ప్రారంభం

ఫతేనగర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాజకీయాల కన్నా ప్రజల సంక్షేమమే తనకు ముఖ్యమని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. గురువారం ఫతేనగర్ డివిజన్ సమతానగర్‌లో రూ. 50 లక్షల వ్యయంతో నిర్మించిన మహిళా మండలి, కమ్యూనిటీ హాలు (రెండంతస్తుల భవనం)ను కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. స్థలం కోర్టు వివాదంలో ఉన్నప్పటికీ సమస్యను సామరస్యంగా పరిష్కరించి భవనం నిర్మించామని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు కంచి భిక్షపతి, సుదర్శన్‌రెడ్డి, బస్తీ నాయకులు రాజేందర్, సతీష్‌గౌడ్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



బస్సు ప్రారంభోత్సవంలో న్యాయమూర్తి తిరుపతి,
బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ద గోవర్ధన్‌రెడ్డి తదితరులు

కూకట్‌పల్లి కోర్టు నుంచి మెహిదీపట్నానికి బస్సు

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి కోర్టు నుంచి మెహిదీపట్నం వరకు ఆర్టీసీ బస్సును మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా 3వ అదనపు జిల్లా న్యాయమూర్తి తిరుపతి గురువారం ప్రారంభించారు. న్యాయవాదులు, కోర్టులో పనిచేసే ఉద్యోగులు, కక్షిదారులకు బస్ సర్వీసు ఉపయోగపడుతుందన్నారు. తమ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకొని కూకట్‌పల్లి బస్ డిపో మేనేజర్ హరి, అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత బస్సు సర్వీసు ఏర్పాటు చేసినందుకు కూకట్‌పల్లి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ద గోవర్ధన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు సంధ్యారాణి, శ్రీనివాస్, మేజిస్ట్రేట్‌లు పృథ్వీరాజ్, శాలిని, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.


వెంకటేశ్వరనగర్‌లో సన్నబియ్యం లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేస్తున్న
విద్య కల్పన ఏకాంత్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు

సన్నబియ్యం లబ్ధిదారుడి ఇంట్లో నాయకుల భోజనం

హైదర్‌నగర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ వెంకటేశ్వరనగర్‌లో సన్న బియ్యం లబ్ధిదారుడి ఇంట్లో డీసీసీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షురాలు విద్య కల్పన ఏకాంత్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు గురువారం భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలకు సన్న బియ్యం ఇవ్వాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి జితేందర్, నాయకుడు సంపంగి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్
మహాసభలను జయప్రదం చేయాలి

హైదర్‌నగర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 21, 22 తేదీల్లో శంషాబాద్‌లో జరిగే మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ కూకట్‌పల్లి మండల కార్యదర్శి జి.కృష్ణ అన్నారు. గురువారం మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సీఐటీయూసీ కార్యాలయం వద్ద నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. నాయకులు, కార్యకర్తలు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎం.డావీద్, రాజు గౌడ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో సమతానగర్

- కాలనీ ఏర్పడి 30 ఏళ్లయినా పరిష్కారం కాని వైనం
- వర్షం వస్తే రోడ్లు జలమయం.. ఇళ్లలోకి నీరు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు


5,6,7 రోడ్లకు కలిపి ఏర్పాటు చేసిన వర్షపు నీటి కాలువ

ఓల్డుబోయినపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజోతి): ఓల్డుబోయినపల్లి డివిజన్‌లోని సమతానగర్ సమస్యలతో సతమతమవుతోంది. 30 ఏళ్ల క్రితం ఏర్పడిన కాలనీలో సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కాలనీలో సుమారు 300 ఇళ్లకు పైగా ఉన్నాయి. అన్ని రంగాల వారు నివసిస్తున్నారు.

వర్షం వస్తే..

చిన్నపాటి వర్షానికే రోడ్లపై నీరు నిలిచి ఇళ్లలోకి వస్తుండడంతో బస్తీ వాసులు భయపడుతున్నారు. వర్షం కురిసిన ప్రతీసారి 5, 6, 7 రోడ్లలోని ఇళ్లలోకి నీరు చేరుతోంది. 15 సంవత్సరాల నుంచి వర్షపు నీటి సమస్యతో ప్రజలు అవస్థలు పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. వర్షపు నీరు వెళ్లేందుకు కాలువలు సరిగా లేనందువల్లే సమస్య తలెత్తుతోందని కాలనీ సంక్షేమ సంఘం నాయకులు అంటున్నారు. సమస్యను పరిష్కరించాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని అంటున్నారు.

కాలువలో పూడిక తీయకపోవడంతో..

బస్తీ ఏర్పాటు సమయంలో 5,6,7 రోడ్లకు కలిపి ఒకే పైపులైన్ వేసి కొద్ది దూరం డ్రైనేజీ పైపులు, ఇంకొంచెం దూరం తక్కువ వెడల్పుతో వర్షం నీటి కాలువను నిర్మించి దానిని మల్లికార్జునగర్ చర్చి వద్ద ఉన్న కాలువకు కలిపారు. కాలువలో పూడిక తీయకపోవడం, చిన్నగా ఉండడంతో చిన్నపాటి వర్షానికే నీరంతా రోడ్లపై పారుతుండడంతోపాటు ఇళ్లలోకి చేరుతోందని స్థానికులు అంటున్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదు

సమతానగర్ బస్తీలో సమస్యలు పరిష్కరించాలని ప్రజలు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. వర్షపు నీటి కాలువలను వెడల్పు చేయడంతోపాటు 5, 6, 7 రోడ్లకు కలిపి వేర్వేరుగా కాలువలు నిర్మించి, బాక్సు టైపు డ్రైనేజీ నాలా నిర్మించాలని జడ్సీకి విన్నవించారు.


మూడు రోజుల క్రితం కురిసిన వర్షంతో రోడ్డుపై నిలిచిన నీటిలో మునిగిన కారు (ఫైల్)

15 ఏళ్ల నుంచి ఇబ్బంది పడుతున్నాం



15 సంవత్సరాల నుంచి సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం. సమస్యలను పరిష్కరించాలని అధికారులు, కార్పొరేటర్‌కు విన్నవించినా ఫలితం లేదు.

- దండంరాజు రాంచందర్, కాలనీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు

చిన్నపాటి వర్షానికే ఇళ్లలోకి నీరు



చిన్నపాటి వర్షం పడితేనే ఇళ్లలోకి నీరు చేరుతోంది. ఇళ్లలో ఉన్న వస్తువులన్నీ తడిచిపోతున్నాయి. వర్షాకాలం రాకముందు అధికారులు సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి.

- పెండెం రాకేష్, కాలనీ యూత్ కన్వీనర్

కూల్చివేశారు.. స్వాధీనం మరిచారు



చింతల చెరువులో వెలిసిన అక్రమ నిర్మాణాలను కూల్చివేసిన హైడ్రా అధికారులు (ఫైల్)

● భూములు స్వాధీనం చేసుకోవాలి

గాజులరామారం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : చెరువుల పరిరక్షణ కోసం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా హైడ్రా ఏర్పాటు చేసింది. ఆ అధికారులు ఎక్కడెక్కడ చెరువులు, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లు కబ్జాకు గురవుతున్నాయో తెలుసుకొని, పలు శాఖల అధికారుల సమన్వయంతో అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపుతున్నారు. ఈ క్రమంలో గాజులరామారం డివిజన్‌లోని చింతల్ చెరువు ఎఫ్‌టీఎల్ బఫర్‌జోన్, రావినారాయణరెడ్డినగర్‌లోని బందంకుంట చెరువులో వెలిసిన అక్రమ నిర్మాణాలను గతంలో పోలీసుల బందోబస్తు నడుమ కుత్బుల్లాపూర్ రెవెన్యూ, మున్సిపల్ అధికారుల సమక్షంలో నేలమట్టం చేశారు. వీటిని కూల్చి నెలలు గడుస్తున్నాయి. కానీ స్వాధీనం చేసుకోవడంలో అలసత్వం వహిస్తుండడంతో చింతల చెరువులో మరలా అక్రమ నిర్మాణానికి కబ్జాదారుడు తెరలేపాడు.

దీంతో రెవెన్యూ అధికారులు అప్రమత్తమై రెండోసారి కూల్చివేశారు. అలాగే బందంకుంటలో వెలిసిన ప్రహరీ, రెండు గదులను రెవెన్యూ అధికారులు గతంలో కూల్చివేశారు. కానీ ఆ స్థలాన్ని కూడా స్వాధీనం చేసుకోకపోవడంతో కబ్జాదారు అక్కడే పాగా వేసి కూర్చున్నాడు. అధికారులు మేల్కొని కూల్చివేసిన భూములను స్వాధీనం చేసుకోవాలి. కనీసం ఆ ప్రాంతంలో హెచ్చరిక బోర్డులైనా ఏర్పాటు చేయాలని దేవేందర్‌నగర్ ప్రజలు తెలుపుతున్నారు.



మల్లంపేటలో రామచంద్రయ్య కాలనీ డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కార్పొరేషన్ కార్యాలయంలో కాలనీ వాసులు ఆందోళన

డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని ఆందోళన

దుండిగల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మల్లంపేటలో రామచంద్రయ్య కాలనీ డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని మల్లంపేట నివాసుడు ఆంజనేయులు కాలనీవాసులతో కలిసి నిజాంపేట్ కార్పొరేషన్ కమిషనర్‌కు గురువారం వినతిపత్రం సమర్పించారు. చెరువులో డ్రైనేజీనీరు కలువకుండా కాంతినగర్ కాలనీ, బొల్లారం ఐటీసీ భద్రాచలం కంపెనీ ప్రాంతంలోని పాత నాలా నుంచి పంపేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. ప్రధానంగా ఈ డ్రైనేజీ వల్ల పక్కనే ఉన్న స్కూల్ విద్యార్థులు, రామచంద్రయ్య కాలనీవాసులు నిత్యం నరకం చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై కమిషనర్, ప్రత్యేక అధికారి, కార్పొరేషన్ ఏఈ, ఇతర అధికారులతో కలిసి మల్లంపేటలో పారుతున్న డ్రైనేజీని పరిశీలించారు. కార్యక్రమంలో రామచంద్రయ్య కాలనీ వాసులు ఉమాదేవి, కృష్ణవేణి, సుజాత, మాయ, సుప్రియ, స్వప్న మహాలక్ష్మి, కవిత, పద్మ, నాగమణి, రాణి, మురళీ ఉన్నారు.

పెంపుడు జంతువుల తోడు.. మానసిక ప్రశాంతతకు మేలు

నేడు జాతీయ పెంపుడు జంతువుల దినోత్సవం



అటవీ ప్రాంతంలో మూగ జీవుల కోసం జంతు ప్రేమికులు ఏర్పాటు చేసిన నీటి సౌకర్యం



పక్షుల కోసం చెట్టుపై చెక్క ఏర్పాటు చేసి పెట్టిన పప్పు దినుసులు, బియ్యం



దుకాణంలో రంగు రంగుల పక్షులు

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మన జీవితంలో భాగంగా మూగ జీవులను పెంచుకునేందుకు ఎంతోమంది ఆసక్తి చూపుతున్నారు. ఈ సందర్భంగా ప్రతి సంవత్సరం ఏప్రిల్ 11ను జాతీయ పెంపుడు జంతువుల దినోత్సవంగా నిర్వహించుకుంటున్నాం. వాటిపై ప్రేమను పెంచుకోవడం, రక్షించుకునేందుకు ఎంతోమంది వ్యయ ప్రయాసలు తమ సాయశక్తులా ప్రయత్నిస్తుంటారు. ఇవి మనకు తోడుగా ఉండడమే కాకుండా మానవ జీవితంలో మానసిక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతకు ఉపయోగపడతాయడంలో సందేహంలేదు. ఒంటరిగా ఉన్న సమయంలో మూగ జీవాలతో సమయాన్ని వెచ్చిస్తే మానసిక ఒత్తిడి దూరమవుతుంది. ఉదాహరణకు కుక్కలను పెంచుకోవడం వల్ల దొంగలు రాకుండా చూడవచ్చు. ఇవి పెంచినవారితో ఎంతో ప్రేమగా ఉంటాయి. మరికొందరు పెంచుకునే జంతువులకు ఇష్టమైన ఆహారాన్ని అందించడం, మనం ధరించినట్లుగా దుస్తులు కూడా వేసి ఆనందిస్తుంటారు. ఈ రోజును కేవలం సంతోషం కోసమే కాకుండా ఆశ్రయం లేని జంతువులు, పక్షుల కోసం ఆలోచించాల్సిన అవసరముంది. పెరుగుతున్న కాంక్రీట్ జంగిల్‌లో ఆహారం, నీరు, ఆశ్రయం లేక ఎన్నో కుక్కలు, అడవుల్లో ఉండే నెమళ్లు, కుందేళ్లు, పిల్లులు, పావురాలు జన సంచారాల్లో సంచరిస్తున్నాయి.

దత్తతకూ ముందుకు..

కొందరికి జంతువులను పెంచుకోవాలన్న కోరిక ఉన్నా వాటి పోషణకు సమయం కేటాయించకపోతే చనిపోతాయనే ఉద్దేశంతో సాహసించడం లేదు. అలాంటివారు ఏదైనా జంతువుల కేంద్రం, అటవీ ప్రాంతంలోని పక్షులు, జంతువులను దత్తత తీసుకోవచ్చు. ప్రతి ఒక్కరూ మూగ జీవులకు తోచినవిధంగా సహాయం చేయాలని, ప్రేమకు చూసుకోవాలని జంతు ప్రేమికులు తెలుపుతున్నారు. గాజులరామారం సర్కిల్ చింతల్ హెచ్‌ఎంటీ అటవీ ప్రాంతంలోని మూగజీవుల కోసం ఎంతోమంది తమకు తోచినంత పని చేస్తున్నారు. ద్వారకానగర్‌కు చెందిన ఓ వ్యక్తి అటవీ ప్రాంతంలోని ఖాళీ స్థలాల్లో పండ్ల మొక్కలను పెంచుతున్నారు. అదేవిధంగా కొందరు అక్కడక్కడ పండ్లు, బియ్యం, పప్పు దినుసులు వేస్తున్నారు. మరికొందరు నీటిని కూడా పెడుతూ మూగ జీవుల దాహార్తిని తీరుస్తున్నారు.

కొందరికి ఉపాధిగా...

రోజురోజుకు అడవులు అంతరించుకుపోతుండడంతో మూగ జీవులు కన్పించడం అరుదుగా మారింది. కాంక్రీట్ జంగిల్‌గా మారిన ప్రస్తుత తరుణంలో నగరంలోని పెద్దలు, పిల్లలకు మూగ జీవులను పరిచయం చేసేందుకు ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. ఆసక్తి గల వారికి మూగ జీవుల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేస్తూ కొందరు ఉపాధి కూడా పొందుతున్నారు. అదే విధంగా పెంపుడు కుక్కలు, కుందేళ్లను అందంగా తీర్చిదిద్దేందుకు పెట్‌స్టోర్స్ అందుబాటులో ఉన్నాయి. వాటికి కటింగ్ చేయడం, ఇతరాత్ర డిజైన్‌లలో అందంగా తీర్చిదిద్దే దుకాణాలు కూడా ఉన్నాయి.

బాధ్యతగా భావిస్తూ..



ఓ పరిశ్రమలో ఉద్యోగం చేస్తున్నా. మనం జీవితంలో మంచి చేయాలనే సంకల్పంతో ముందుకెళ్లాలి. ఇందులో భాగంగా భవిష్యత్తు తరాలు, మూగ జీవుల కోసం హెచ్‌ఎంటీ అటవీ ప్రాంతంలో పండ్లు, నీడనిచ్చే మొక్కలను పెంచుతున్నా. ఒక బాధ్యతగా భావిస్తూ చేస్తున్నాను. పెంచిన చెట్ల పండ్లను నేను తినకపోవచ్చు. కానీ మూగ జీవులు, భవిష్యత్ తరాల పిల్లలకు ఉపయోగపడుతాయని భావిస్తున్నా. మూగ జీవుల కోసం కొంత సమయం కేటాయించాలని ఆశిస్తున్నా.

- లింగారెడ్డి, జంతు, చెట్ల ప్రేమికుడు

నిజాంపేట్‌లో కాంగ్రెస్ నాయకుల పాదయాత్ర



పాదయాత్రలో పాల్గొన్న కొలన్ శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, మహిళలు

నిజాంపేట్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ఏఐసీసీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న జైభీమ్ జైబాపూ జైసంవిధాన్ కార్యక్రమంలో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి, సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి నిజాంపేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు రాజశేఖర్‌ల ఆధ్వర్యంలో గురువారం కార్పొరేషన్‌లోని 24, 5, 6వ డివిజన్లలో వందలాది మంది కార్యకర్తలతో కలిసి పాదయాత్ర నిర్వహించారు.

ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మహాత్మా గాంధీ, అంబేద్కర్ సేవలను తెలియజేస్తూ, ప్రజలను చైతన్యం చేయడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీలో మాజీ కార్పొరేటర్లు కొలన్ వీరేందర్ రెడ్డి, చిట్ల దివాకర్, ఇంద్రజిత్‌రెడ్డి, నాయకులు జగదీష్ యాదవ్, రఫియా బేగం, ఇందిర, జీవన్‌నెడ్డి, రాజిరెడ్డి, వీరబాబు, వాసు, మురళీకృష్ణ, మల్లికార్జున్, నారాయణరెడ్డి, రాములు, మహేష్‌తో పాటు కార్యకర్తలు ఉన్నారు.



ఎంపీ ఈటల రాజేందర్ ద్వారా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందుకుంటున్న బాచుపల్లికి చెందిన మహిళ

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

నిజాంపేట్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : నిజాంపేట్ కార్పొరేషన్ 1వ డివిజన్ మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు చొరవతో ఎంపీ ఈటల రాజేందర్ సిఫార్సుతో హరితవనం కాలనీ నివాసి కనకమేడల కిషోర్ కుమార్ అనారోగ్యానికి సంబంధించి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 50 వేలు చెక్కును గురువారం మాజీ కార్పొరేటర్ కిషోర్ కుమార్ సతీమణికి అందజేశారు. ఈ సందర్భంగా బాధితురాలు ముఖ్యమంత్రికి, ఎంపీ ఈటల రాజేందర్‌కు, విజయలక్ష్మి సుబ్బారావుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్

షాపూర్‌నగర్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్లు పారదర్శకంగా, అవినీతి రహితంగా, తక్కువ సమయంలో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం స్లాట్ బుకింగ్ పద్ధతిని ప్రవేశపెట్టిందని మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. గురువారం సూరారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్లను ప్రారంభించారు. గ్రేటర్ పరిధిలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఒక్కరే రిజిస్ట్రార్ ఉండగా సూరారం కార్యాలయానికి ముగ్గురిని నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. వీరిలో ఇప్పటివరకు పనిచేస్తున్న సబ్ రిజిస్ట్రార్ ఉండగా కొత్తగా మరో ఇద్దరిని అదనంగా పనిచేసేలా నియమించడం జరిగింది. వీరిలో ఒకరు నల్గొండ జిల్లా నుంచి, హైదరాబాద్ జిల్లా నుంచి మరొకరిని కుత్బుల్లాపూర్ ఎస్‌ఆర్‌ఓకు బదిలీ చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఒక్కో కార్యాలయంలో రోజుకు 48 డాక్యుమెంట్లు మాత్రమే రిజిస్ట్రేషన్లు జరిగేలా వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురానున్నారు.



స్లాట్ బుకింగ్‌ను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ గౌతమ్



జిల్లా ఆర్‌డీఓకి వినతిపత్రం అందజేస్తున్న రవీందర్

ఈతను పాఠ్యాంశంలో చేర్చాలని వినతి

షాపూర్‌నగర్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర విద్యాశాఖలు ఈత ఒక సాధన అని, దీనిని పాఠ్యాంశంగా చేర్చాలని మేడ్చల్ జిల్లా ఆర్‌డీఓకు సామాజిక కార్యకర్త రవీందర్ ముదిరాజ్ గురువారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠ్యాంశాల్లో ఈతను చేర్చి విద్యార్థులకు నేర్పిస్తే సైన్స్ లేదా సోషల్‌లో రెండు మార్కులు ఇచ్చేవిధంగా ప్రభుత్వం జీవోను జారీచేయాలన్నారు.



మదన్‌గౌడ్‌ని సన్మానిస్తున్న కార్మికులు

కార్మికుల సంక్షేమమే ధ్యేయం

షాపూర్‌నగర్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామని శ్రమశక్తి అవార్డు గ్రహీత ముద్దాపురం మదన్‌గౌడ్ అన్నారు. గురువారం గాంధీనగర్ పారిశ్రామికవాడలోని ఆర్డీ ఇంజనీరింగ్ పరిశ్రమలో వేతన ఒప్పందం జరగడంతో కార్మికుల సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సన్మాన కార్యక్రమానికి మదన్‌గౌడ్ హాజరయ్యారు. కార్మిక నాయకులు, యూనియన్ సభ్యులు, పెద్దసంఖ్యలో పాల్గొని ప్రస్తుతం వస్తున్న వేతనానికి తోడు పెరిగిన రూ.1300లు అదనంగా రావడానికి ప్రయత్నించిన ఆయనను కార్మికులు ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో కంపెనీ ప్రెసిడెంట్ అమిత్‌సింగ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సుభాష్, సెక్రెటరీ దేవేందర్, కార్మికులు పాల్గొన్నారు.

రాష్ట్రీయ దళిత సేన విభాగం జాతీయ ఓబీసీ ఉపాధ్యక్షుడి నియామకం

జీడిమెట్ల, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి):రాష్ట్రీయ దళితసేన విభాగం జాతీయ ఓబీసీ ఉపాధ్యక్షునిగా ఎం.జనార్దన్‌ను నియమిస్తూ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జేబీ రాజు ఉత్తర్వులు జారీ చేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట ప్రాంతానికి చెందిన జనార్ధన్ కార్మిక నాయకునిగా పనిచేశారు. జాతీయ ఉపాధ్యక్షునిగా నియామకపత్రం అందుకున్న ఆయన మాట్లాడుతూ దేశంలో ఉన్న బీసీలు ఐక్యం కావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ కార్యక్రమంలో జేమ్స్, ఐలయ్యగౌడ్, అమర్‌బాబు, జహంగీర్, అశోక్ పాల్గొన్నారు.

కళాశాలల బస్సులకు కెమెరాలు అమర్చాలి

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : కళాశాలల బస్సులకు కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అల్వాల్ సీఐ నాగరాజు అన్నారు. కొంపల్లి మున్సిపల్‌లోని సాదు వాహిని ఇంటర్నేషనల్ స్కూల్‌లో బస్సు డ్రైవర్లకు, హెల్పర్లకు, సిబ్బందికి ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమాన్ని ఆయన సిబ్బందితో కలిసి గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయిదు సంవత్సరాల అనుభవమున్న డ్రైవర్లను యాజమాన్యం నియమించుకోవాలని, ఫోన్‌లు మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదన్నారు. పాఠశాల పిల్లలను తీసుకువెళ్లే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. అలాగే బస్సులకు ముందు, పక్కన మిర్రర్లను అమర్చుకోవాలని, ఫైర్ సేఫ్టీ గన్సు, అలారం సిస్టమ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఒక కెమెరా బస్సు లోపల, మరొకటి బస్సు ముందు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ట్రాఫిక్ సిబ్బంది, డ్రైవర్లు పాల్గొన్నారు

గంజాయి విక్రేత అరెస్ట్

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ఓ ర్యాపిడో బైక్ రైడర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పేట్‌బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రంగారెడ్డి జిల్లా రాజేందర్‌నగర్ బాలాపూర్ షాహీన్‌నగర్‌కు చెందిన షేక్ అబ్దుల్ వాసిన్(29) ర్యాపిడో బైక్ రైడర్‌గా పని చేస్తుంటాడు. అక్రమమార్గంలో డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయిని విక్రయించేందుకు సుచిత్ర చౌరస్తాకు వచ్చాడు. సుచిత్ర చౌరస్తాలో గంజాయిని విక్రయిస్తున్నారనే సమాచారం అందుకున్న పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా అతని వద్ద 900 గ్రాముల గంజాయి లభించింది. అతడిపై కేసునమోదు చేసి గురువారం రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.



గదులను కూల్చివేస్తున్న రెవెన్యూ అధికారులు

అక్రమ నిర్మాణాల కూల్చివేత

గాజులరామారం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలంలో వెలిసిన అక్రమ నిర్మాణాలను కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులు పోలీసులు సహాయంతో నేలమట్టం చేశారు. గాజులరామారం డివిజన్ దేవేందర్‌నగర్ ప్రభుత్వ సర్వే నంబరు 342, 307ల్లో వెలిసిన 5 గదులు, 8 బేసిమెంట్లను గురువారం ఆర్‌ఐ కలీల్ సిబ్బందితో కలిసి కూల్చివేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఐ మాట్లాడుతూ ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మాణాలను చేపడితే వారిపై కేసులను నమోదు చేస్తాం అన్నారు.

రోడ్డుపై చెత్త.. వెళ్లేదెట్టా?



రహదారికి పక్కనే పేరుకుపోయిన చెత్త

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కొంపల్లి పురపాలకసంఘం పరిధిలోని దూలపల్లి ఫారెస్ట్ రహదారిలో పక్కనే చెత్త పేరుకుపోయి దర్శనం ఇస్తుంది. గాలి దుమారం వచ్చిన సమయంలో పేపర్లు, ప్లాస్టిక్ కవర్లు ఎగిరి ద్విచక్రవాహనదారుల ముఖంపై పడుతున్నాయి. దీంతో వాహనదారులు పడిపోయి గాయాల పాలవుతున్నారని గురువారం ఓ ద్విచక్ర వాహనదారుడు చెత్త ఉన్న ప్రాంతాన్ని వీడియోలు తీసి కొంపల్లి మున్సిపల్ వాట్సాప్ గ్రూపులో పెట్టాడు. దీనితో అధికారులకు కనువిప్పు కలిగి చెత్తను తొలగిస్తారా? లేక అలానే ఉంచుతారా? వేచి చూడాల్సిందే.

శ్మశాన వాటికల్లో అడ్డగోలు వసూళ్లకు చెక్

నిజాంపేట్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : నిజాంపేట్ నగరపాలక సంస్థ పరిధిలోని శ్మశాన వాటికల్లో దహన సంస్కారాలకు అడ్డగోలుగా వసూళ్లు చేసే ప్రక్రియకు కార్పొరేషన్ కమిషనర్ చెక్ పెట్టారు. దహన సంస్కారాల కోసం వెచ్చించే ఖర్చుల పట్టికను నిర్ణయించారు. వాహన ఛార్జి రూ.3 వేలు, కాష్టం రూ.5వేలు, కట్టెలు, కిరోసిన్ చార్జి వెయ్యి రూపాయలు, అలాగే దహన సంస్కారం చేసిన వారసునికి గుండు చేసినందుకు గీసినందుకు రూ.100గా నిర్ణయించారు. అదేవిధంగా డప్పు ఖర్చు రూ.15 వందలు ధరలను మున్సిపల్ అధికారులు నిర్ణయించారు. శ్మశాన వాటికల్లో ఉన్న కాటికాపరి, మంగలి, డప్పు వారు సదరు ఛార్జీలను మించకుండా వసూళ్లు చేయాలన్నారు. వీటికి మించి ఎవరైనా ఎక్కువగా వసూలు చేస్తే మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని కమిషనర్ సూచించారు.

ప్రభుత్వ స్థలంలో వేసిన సీసీ రోడ్డు!

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : గాజులరామారం సర్కిల్ చింతల్ డివిజన్ సర్వే నంబరు 148లో భగత్‌సింగ్‌నగర్ దోబీఘాట్ సమీపంలో బఫర్‌జోన్‌లో అక్రమ నిర్మాణాలను చేపట్టారని స్థానికులు తెలుపుతున్నారు. అది ప్రభుత్వభూమి అని తెలిసినా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ఇదిలా ఉండగా ఆ నిర్మాణదారుల కోసం ఆరు నెలలు క్రితమే ఇంజనీరింగ్ అధికారులు లక్షలాది రూపాయల ప్రజాధనంతో సీసీ రోడ్డును కూడా వేశారు. వీటిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు ఆకుల సతీష్, నల్ల జయశంకర్‌గౌడ్ బృందం ఉప కమిషనర్ మల్లారెడ్డికి గురువారం ఫిర్యాదు చేశారు. బడుగు, బలహీనవర్గాల బస్తీల్లో ఒక డ్రైనేజీ మ్యాన్‌హోల్ నిర్మించాలంటేనే చెప్పులు అరిగేలా తిప్పుకునే అధికారులు ఇళ్ల నిర్మాణాలు లేకుండానే రోడ్డును ఎలా వేస్తారని ప్రశ్నించారు. ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారులు, విజిలెన్స్ అధికారులు ఈ విషయంపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. స్పందించకుంటే జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కి ఫిర్యాదు చేస్తామని వారు స్పష్టం చేశారు.



అక్రమ నిర్మాణాలకు ముందు వేసిన సీసీ రోడ్డు



అక్రమ నిర్మాణాలు చేపట్టిన అనంతరం

ఆహ్లాదం పంచుతున్న పూలచెట్లు

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : గాజులరామారం సర్కిల్ చింతల్ డివిజన్ పరిధిలో వందలాది ఎకరాలలో విస్తరించి ఉన్న హిందుస్థాన్ మెషిన్ టూల్స్(హెచ్‌ఎంటీ) అటవీ ప్రాంతం వల్ల మంచి గాలి, జీడిమెట్ల పారిశ్రామికవాడలోని పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్యం ఈ చెట్ల వల్ల కొంత తగ్గుతుందని పలువురు తెలుపుతున్నారు. అయితే హెచ్‌ఎంటీ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం సమీపంలోని అటవీ ప్రాంతంలో ఉన్న బౌగన్ విల్లా(కాగితపు పూలచెట్లు)వద్ద కొన్ని చెట్లు గులాబీ, కాషాయం, ఎరుపురంగు పూలను విరబూసాయి. ఈ పూల మొక్కలు ఆహ్లాదం పంచడంతో పాటు అందంగా కనిపిస్తున్నాయి. ఈ మొక్కలు గాలిలో ఎన్నో ఔషధ గుణాలున్నాయని పర్యావరణ ప్రేమికులు తెలుపుతున్నారు.



ఎరుపు రంగు కాగితపు పూల మొక్క



హెచ్‌ఎంటీ అటవీ ప్రాంతంలో రోడ్డు పక్కన గులాబీరంగు కాగితపు పూలు



కాషాయపు రంగు పూల మొక్క

కూకట్‌పల్లి కోర్టు నుంచి మెహిదీపట్నానికి బస్సు

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి కోర్టు నుంచి మెహిదీపట్నం వరకు ఆర్టీసీ బస్సును మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా 3వ అదనపు జిల్లా న్యాయమూర్తి తిరుపతి గురువారం ప్రారంభించారు. న్యాయవాదులు, కోర్టులో పనిచేసే ఉద్యోగులు, కక్షిదారులకు బస్ సర్వీసు ఉపయోగపడుతుందన్నారు. తమ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకొని కూకట్‌పల్లి బస్ డిపో మేనేజర్ హరి, అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత బస్సు సర్వీసు ఏర్పాటు చేసినందుకు కూకట్‌పల్లి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ద గోవర్ధన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

'రాజీవ్ యువ వికాసం'లో క్షత్రియ కులాన్ని చేర్చాలి

కూకట్‌పల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకంలో కొన్ని కులాలకు చోటు కల్పించకపోవడం దురదృష్టకరమని ఎమ్మెల్యే అన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో క్షత్రియ, ఆంధ్రప్రదేశ్‌లో అనేక కులాలకు చెందిన పేద, బడుగు, బలహీనవర్గాల వారు ఉన్నారని వారందరికీ పథకంలో అవకాశం కల్పించాలని కమిషనర్‌ను కోరారు.

ఈ రోడ్డుకు త్వరలో మోక్షం

- హాఫీజ్‌పేట్ మంజీర పైప్‌లైన్ రోడ్డు పనులకు నిధుల మంజూరు
- వారం రోజుల్లో టెండర్ ప్రక్రియ పూర్తి
- 10-15 రోజుల్లో పనులు ప్రారంభం
- చందానగర్ డివిజన్ కాలనీవాసులకు తీరనున్న ట్రాఫిక్ కష్టాలు


ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఎదుట గుంతల మయంగా రోడ్డు


ఆర్టీసీ కాలనీ వద్ద రోడ్డు దుస్థితి

చందానగర్, ఏప్రిల్10 (ఆంధ్రజ్యోతి): చందానగర్, హాఫీజ్‌పేట్ డివిజన్ కాలనీవాసులకు త్వరలో ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి. హఫీజ్‌పేట్ మంజీర పైప్‌లైన్ రోడ్డు నిర్మాణ పనులకు ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో వారం రోజుల్లో టెండర్ ప్రక్రియ పూర్తిచేసి 10-15 రోజుల్లో పనులు ప్రారంభం కానున్నాయి. ఈ రోడ్డు నిర్మాణానికి సంబంధించిన రూ.3.12 కోట్ల నిధులు విడుదలయ్యాయి. దీంతో నిర్మాణ పనుల ప్రారంభానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. జాతీయ రహదారికి ప్రత్యామ్నాయంగా ఉపయోగపడే రహదారుల్లో ఈ రోడ్డు ప్రధానమైంది. హాఫీజ్‌పేట్ పైప్‌లైన్ రోడ్డు బీహెచ్‌ఈఎల్ చౌరస్తా నుంచి మొదలుకొని కేపీహెచ్‌బీ మీదుగా మూసాపేట్ వరకు ఈ రహదారిగుండా రాకపోకలు సాగించవచ్చు. ఈ మార్గంలో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కాలం చెల్లిన రోడ్డుతోపాటు పురాతన పైప్‌లైన్ల లీకేజీలతో రోడ్డు అంతా గుంతలమయంగా మారింది. కొత్త పైప్‌లైను ఏర్పాటు కోసం అనేకసార్లు పలు కాలనీల వాసులు, రాజకీయ పార్టీలు అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతులు అందజేశారు. పైప్‌లైన్ నిర్మాణ పనులు పూర్తయిన తరువాతే రోడ్డు జీహెచ్ఎంసీ నిర్మాణ పనులను చేపట్టాల్సి ఉంది. కాగా పైప్‌లైన్ పనులు పూర్తయ్యాయి. ఇప్పుడు జీహెచ్ఎంసీ రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉంది.

సీసీరోడ్డా, బీటీ రోడ్డా.. అధికారుల తర్జనభర్జన

బీహెచ్‌ఈఎల్ నుంచి ఆర్టీసీ కాలనీ వరకు ఈ రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఈ రోడ్డు అతి పురాతనమైంది. మంజీర పైప్‌లైన్లు లీకేజీ కావడంతో అనేక చోట్ల మరమ్మతుల కోసం తవ్విన గుంతలు ఉన్నాయి. భవిష్యత్‌లో మంజీర పైప్‌లైన్లకు లీకేజీలు ఏర్పడితే మళ్లీ మరమ్మతులు చేయాల్సి వస్తే రోడ్డు పరిస్థితి ఏ విధంగా ఉంటుందనే సమాలోచన చేసి బీటీ రోడ్డు నిర్మించాలని అధికారులు నిర్ణయానికి వచ్చారు.

మూడు విభాగాలుగా రోడ్డు నిర్మాణ పనులు

బీహెచ్‌ఈఎల్ నుంచి హఫీజ్‌పేట్ మంజీర పైప్‌లైన్ రోడ్డు నిర్మాణ పనులు మూడు విభాగాలుగా విభజించారు. బీఆర్ గ్యాస్ ఏజెన్సీ నుంచి చందానగర్ మున్సిపల్ కార్యాలయం వరకు రోడ్డు నిర్మాణం కోసం రూ.1.53 కోట్లు, ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ నుంచి మైహోం జ్యువల్స్ వరకు కోటి రూపాయలు విడుదల చేశారు. చందానగర్ మున్సిపల్ కార్యాలయం నుంచి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ వరకు రూ.1.43 కోట్లు నిధులకు సంబంధించిన దస్త్రం ఉన్నతాధికారుల వద్ద పెండింగ్‌లో ఉంది. నేడే రేపో ఆ దస్త్రం కూడా విడుదలవుతుందని అధికారులు చెబుతున్నారు.

త్వరలో రోడ్డు నిర్మాణ పనులు చేపడుతాం

చందానగర్ బీఆర్ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం నుంచి మైహోం జ్యువల్స్ వరకు గల మంజీర పైప్‌లైన్ రోడ్డులో నిర్మాణ పనులు త్వరలోనే చేపడుతాం. నిధులు మంజూరయ్యాయి. వారం రోజుల్లో టెండర్ ప్రక్రియ పూర్తిచేసి నిర్మాణ పనులను ప్రజాప్రతినిధులతో శంకుస్థాపన చేయిస్తాం.
- ఇందిరాబాయి, ఈఈ, చందానగర్ సర్కిల్ -21


వెంకటేశ్వరనగర్‌లో సన్నబియ్యం లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేస్తున్న రంగారెడ్డి జిల్లా డీసీసీ ఉపాధ్యక్షురాలు విద్య కల్పన, తదితర నాయకులు

లబ్ధిదారుడి ఇంట్లో కాంగ్రెస్ నాయకుల భోజనం

హైదర్‌నగర్, ఏప్రిల్10 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ వెంకటేశ్వరనగర్‌లో రేషన్‌కార్డు ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న సన్నబియ్యం లబ్ధిదారుడి ఇంట్లో రంగారెడ్డి జిల్లా డీసీసీ ఉపాధ్యక్షురాలు విద్యకల్పన, ఏకాంత్‌గౌడ్ గురువారం భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలో పేదల ఇళ్లల్లో సంతోషాన్ని నింపే విధంగా ముందుకు సాగుతూ సన్నబియ్యం ప్రతి పేదవాడు కూడా తినాలనే ఉద్దేశ్యంతో సీఎం రేవంత్‌రెడ్డి ఈ పథకాన్ని తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి జితేందర్, నాయకులు సంపంగి యాదగిరి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


శాతవాహన కాలనీలో డ్రైనేజీ పైపులైను పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు

శాతవాహన కాలనీలో సమస్యలు పరిష్కరిస్తాం

హైదర్‌నగర్, ఏప్రిల్10 (ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ డివిజన్ హెచ్ఎంటీ శాతవాహన కాలనీలో జరుగుతున్న డ్రైనేజీ పైప్‌లైను పనులను ఇరిగేషన్ విభాగం, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులతో కలిసి గురువారం కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా నార్నె మాట్లాడుతూ, కాలనీలో పర్యటించి డ్రైనేజ్‌లైన్ పనులను లెవల్ కలిసేలా చూడాలని అన్నారు. చెరువులో దోమల నివారణ కొరకు డ్రోన్‌తో మందులు చల్లించాలని, ఆయిల్‌సీడ్స్‌బాల్స్‌ను చెరువులో వేసేలా, రెండురోజుల కోసారైనా ఫాగింగ్ జరిగేలా చూడాలని అన్నారు. తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామన్నారు. అత్యవసర పనులను వెంటనే పూర్తిచేస్తామన్నారు. కాలనీలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ లక్ష్మీనారాయణ, కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.


వరదనీటి కాల్వ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

వరదనీటి కాల్వ పూడికతీత పనుల పరిశీలన

మియాపూర్, ఏప్రిల్10 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని పరికి చెరువు నుండి ఆల్విన్‌కాలనీ ఫేజ్-2 మీదుగా పైపులైను రోడ్డు వరకు విస్తరించి ఉన్న ఓపెన్‌నాలా, వరదనీటి కాలువలో జరుగుతున్న పూడికతీత పనులను గురువారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ఓపెన్‌నాలా పూడికతీత పనులను మాన్సూన్ ముందుగానే పూర్తిచేస్తామని అన్నారు. వేసవి కాలంలోనే పనులు పూర్తిచేస్తే వర్షాకాలంలో వచ్చే వరదనీరు అంతా సజావుగా దిగువకు వెళ్లిపోతుంది కాబట్టి లోతట్టు ప్రాంతాల వారికి ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, షౌకత్‌అలీ మున్నా, ఏఈ శ్రావణి, వర్క్‌ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


కొండాపూర్ బొడ్రాయి వేడుకల్లో టెంకాయ కొడుతున్న రవికుమార్ యాదవ్

వడ్డెర బస్తీలో బొడ్రాయి వేడుకలు

గచ్చిబౌలి, ఏప్రిల్ 10 ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి సర్కిల్ కొండాపూర్ డివిజన్ పరిధిలోని వడ్డెర బస్తీలో గురువారం బొడ్రాయి వేడుకలు అంగరంగా వైభవంగా జరిగాయి. వేడుకల్లో నియోజక వర్గం బీజేపీ నాయకుడు రవికుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ప్రాంతంలో ప్రతీ గ్రామంలో బొడ్రాయిని ప్రతిష్ఠించుకోవడం ఆనవాయితీగా వస్తుందని అన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రాధాకృష్ణయాదవ్, వెంకటేశ్, నారాయణ బాలారాజు సాయి తిరుపతి శ్రీను, పాండు, తదితరులు పాల్గొన్నారు.


కొండాపూర్ బొటానికల్ గార్డెన్‌లో కుక్కల సంచారం

బొటానికల్ గార్డెన్‌లో వీధి కుక్కల విహారం

గచ్చిబౌలి, ఏప్రిల్ 10 ఆంధ్రజ్యోతి): కొండాపూర్‌లోని బొటానికల్ గార్డెన్‌లో ఈ మధ్య వీధి కుక్కల సంచారం ఎక్కువయింది. గార్డెన్ పరిసర ప్రాంతాల నుంచి వీధి కుక్కలు గార్డెన్ ప్రహరీ గోడదూకి వస్తున్నట్లు వాకర్స్ తెలిపారు. కుక్కల దాడిలో వారం రోజుల క్రితం ఓ నెమలి మృతి చెందిన విషయం తెలిసిందే. నెమలి మృతి చెంది వారం రోజులు గడవక ముందే గార్డెన్‌లోకి గురువారం ఉదయం వీధి కుక్కల సంచారంతో వాకర్లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా ఉదయం సాయంత్రం సమయాల్లోనే కుక్కలు ఎక్కువగా గార్డెన్‌లోకి ప్రవేశిస్తున్నట్లు వారు వివరించారు. ఆ సమయాల్లోనే పక్షులు ఆహారం కోసం ఆరుబయట సంచరిస్తుంటాయి. ఈ సమయంలోనే నెమళ్లు, ఇతర పక్షులపై వీధి కుక్కలు దాడులు చేస్తున్నాయని వాకర్లు చెబుతున్నారు.

చౌరస్తాలను సుందరీకరిస్తాం : ఎమ్మెల్యే ఆరెకపూడి


ఆధునీకరించిన చౌరస్తా


సుందరీకరించిన కూడళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు రాగం నాగేందర్‌యాదవ్, గంగాధర్‌రెడ్డి

గచ్చిబౌలి, రాయదుర్గం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పలు కూడళ్లను ఆధునీకరించి సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. గచ్చిబౌలి జంక్షన్, నల్లగండ్ల, గోపన్‌పల్లి, తెల్లాపూర్ చౌరస్తాలో సుందరీకరించి విద్యుత్ వెలుగులతో అభివృద్ధి చేసిన కూడళ్లను గురువారం ఆయన కార్పొరేటర్లు రాగం నాగేందర్‌యాదవ్, గంగాధర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియోజకవర్గంలో ఇప్పటికే ప్రధాన కూడళ్లను అభివృద్ధి చేసి సుందరంగా తీర్చిదిద్దామని, భవిష్యత్‌లో మరిన్ని కూడళ్లను సుందరీకరిస్తామని తెలిపారు. సుందరీకరణతో కూడళ్లకు కొత్తకళ వచ్చిందని ప్రజలు, వాహన దారులను ఈ కూడళ్లు ఆకట్టుకుంటున్నాయన్నారు. సరదాగా కాసేపు సేద తీరేలా వసతులు కల్పించడం జరిగిందని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ వివరించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఒకవైపు గాలివాన.. మరోవైపు ట్రాఫిక్‌జాం

వర్షంలో తడుస్తూ వాహనదారుల ఇక్కట్లు

రాయదుర్గం, ఏప్రిల్10 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు గాలి వాన.. మరోవైపు తీవ్ర ట్రాఫిక్‌జాంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గురువారం సాయంత్రం గచ్చిబౌలి, రాయదుర్గం, మాదాపూర్, కొండాపూర్, మియాపూర్, శేరిలింగంపల్లి ప్రాంతాల్లో వర్షం కురవడంతో రహదారులు జలమయమయ్యాయి. దీంతో వాహనాలు నెమ్మదిగా కదలడంతో గచ్చిబౌలి, రాయదుర్గం, లింగంపల్లి, కొండాపూర్ ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించింది. కొద్ది నిమిషాల వ్యవధి ప్రయాణానికి 40నుంచి గంటకు పైగా సమయం పట్టడంతో వాహనదారులు నరకయాతన పడ్డారు. ద్విచక్రవాహన దారులయితే ఓవైపు తడుస్తూనే ట్రాఫిక్‌లో చిక్కుకుపోయి తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



గచ్చిబౌలి, రాయదుర్గంలో కురుస్తున్న వర్షంలో వాహనదారుల ఇబ్బందులు

అయ్యప్పస్వామి ఆలయంలో పూజలు


అయ్యప్పస్వామి


పూజలకు సిద్ధంగా ఉన్న కలషాలు

చందానగర్, ఏప్రిల్10 (ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వామి జన్మనక్షత్రమైన మూలనక్షత్రం (ఉత్తర ఫల్గుణి నక్షత్రం)సందర్భాన్ని పురస్కరించుకొని చందానగర్ దీప్తీశ్రీనగర్‌లోని జగద్రక్షక శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు విశేష పూజలు చేయనున్నారు. ఉదయం సుప్రభాతపూజ, అయ్యప్పస్వామికి పంచామృతాభిషేకాలు, అర్చనలు, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ ఉంటుందని ఆలయ కమిటీ తెలిపింది. సాయంత్రం ప్రసాద్‌గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి ఆగమనశాస్త్ర యుక్తంగా స్వామివారికి పడిపూజ నిర్వహించనున్నారు. పల్లకీ సేవ, తీర్థ ప్రసాదాలు వితరణ చేయనున్నారని ఆలయ కమిటీ తెలిపింది.

21,22 తేదీల్లో శంషాబాద్ లో మహాసభ

హైదర్‌నగర్, ఏప్రిల్10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ ఈనెల 21,22 తేదీల్లో శంషాబాద్‌లో జరిగే మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ కూకట్‌పల్లి మండల కార్యదర్శి జి.కృష్ణ అన్నారు. గురువారం మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సీఐటీయూసీ కార్యాలయం వద్ద నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, కార్మికులు పాల్గొని సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎం.దావీద్, రాజుగౌడ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.


మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆత్మీయ కలయికనే ఈద్ మిలాన్: ఎమ్మెల్యే గాంధీ

చందానగర్, ఏప్రిల్10 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పర్వదినం ముగిసిన అనంతరం ఆత్మీయ కలయికనే ఈద్ మిలాన్ అంటారని.. అనాదిగా ఈ ఆనవాయితీ వస్తున్నదని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. చందానగర్ డివిజన్ జవహర్‌నగర్ కాలనీలో గురువారం ఏర్పాటు చేసిన ఈద్ మిలాన్ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. త్యాగానికి, ప్రేమకు, దయ, సానుభూతి, క్రమశిక్షణ, దానగుణం నేర్పే పవిత్ర రంజాన్ తరువాత అందరి కలయికనే ఈద్ మిలాన్ అని తెలిపారు. దీంతో సమాజంలో సోదరభావం ఏర్పడుతుందన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు ఈద్ మిలాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చందానగర్ డివిజన్ సీనియర్ నాయకుడు రఘునాథ్ రెడ్డి, ముస్లింలు ఉన్నారు.

పీజేఆర్ స్టేడియంలో నేటి నుంచి వాలీబాల్ పోటీలు

చందానగర్, ఏప్రిల్10 (ఆంధ్రజ్యోతి): చందానగర్ పీజేఆర్ స్టేడియంలో 3ఏ సైడ్ వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కప్ చాంపియన్ షిప్ పోటీలు తెలంగాణ 3ఏ సైడ్ వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరుగనున్నాయి. ఈ జాతీయ స్థాయి పోటీలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయని నిర్వాహకుడు వెంకటేష్‌గౌడ్ తెలిపారు. ఈ పోటీల్లో తెలంగాణ, మహారాష్ట్ర, డయ్యూ డామన్, గుజరాత్, పంజాబ్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, జమ్మూ అండ్ కాశ్మీర్, హర్యాణా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి పురుషులు, స్త్రీలు పోటీల్లో సుమారు 180 మంది క్రీడాకారులు పాల్గొననున్నారని ఆయన తెలిపారు. గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు సర్టిఫికెట్లు కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు.

తుల్జాభవానీ ఆలయంలో ప్రత్యేక పూజలు

గచ్చిబౌలి, ఏప్రిల్ 10 ఆంధ్రజ్యోతి): తారానగర్ తుల్జాభవానీ అమ్మవారి ఆలయంలో చైత్రపౌర్ణమి సందర్భంగా మూల మంత్ర యాగం, సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి రామశాస్త్రి తెలిపారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాలో పాల్గొనదలచిన వారు ముందుగా ఈఓ ను కలిసి తమ పేర్లను నమోదుచేసుకోవాలని పూజారి సూచించారు.


తుల్జాభవాని అమ్మవారు


మాట్లాడుతున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొమిరిశెట్టి సాయిబాబా

'బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి'

మియాపూర్, ఏప్రిల్10 (ఆంధ్రజ్యోతి): ఈనెల 27న వరంగల్‌లో పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయడమే లక్ష్యంగా అందుకు సంబంధించిన సన్నాహ సమావేశం గురువారం గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ సాయిబాబా, కార్పొరేటర్ రోజాదేవి ఆధ్వర్యంలో మియాపూర్ అతిథి హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉద్యమకారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. పార్టీ 25 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా జరిగే ఉత్సవాలను విజయవంతానికి నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం నుంచి సభకు భారీగా తరలివెళ్లాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రవియాదవ్, పురుషోత్తంయాదవ్, మల్లారెడ్డి, హరీష్‌రావు,రవీందరయాదవ్, బాబుమోహన్, మల్లేష్, శ్రీకాంత్, శ్రీనివాస్‌గౌడ్, రామకృష్ణ, శేఖర్‌గౌడ్, బిఎస్ఎన్ కిరణ్ యాదవ్, రోజా, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


చందానగర్ ఎంఎంటీఎస్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద రోడ్డు పక్కనే చెత్త

సార్లూ.. జర పట్టించుకోరూ?

చందానగర్, ఏప్రిల్10 (ఆంధ్రజ్యోతి): చందానగర్ ఎంఎంటీఎస్ రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి పాపిరెడ్డికాలనీకి వెళ్లే రహదారి పొడవునా చెత్త పేరుకుపోయింది. దీని నుంచి వెలువడే దుర్వాసన భరించలేకపోతున్నామని వాహనచోదకులు, పాదచారులు అంటున్నారు. నిత్యం ఇదే తంతూ. పలు కాలనీల్లోని ఇళ్లల్లో వెలువడే చెత్తచెదారం ఇక్కడ పడవేస్తున్నారని, దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు.